# మర్యాద

ముట్నూరు సంగమేశం

"శీతాపతీ"

"ప్రభూ"

"మనవద్ద ఉన్న కుక్కలెన్నో ?"

"మొత్తం పదిహేనుంటాయి ప్రభూ"

"అయితే మన కందులో అవసరం ఎన్నుంటావు ?"

"చిత్తం, ఇంచుమించు అన్నీ అవసరమే ప్రభూ !"

"ఛా ! అన్నీ ఎందుకోయ్ ?"

"చిత్తం, ఏమి శెలవు ?"

"గుర్రాలెన్నున్నాయి !"

"ఒక్కటే ప్రభూ !"

"అయ్యో ! దివాణం అంత హీనంగా ఉందా ?"

"లేదు ప్రభూ ! ప్రభువువారు కారు కొన్నాక గుర్రాలు అవసరం లేక గతించాయి."

"పోనీ, అవి సహజంగా గతించాయా ?"

"చిత్తం"

"ఇంకా ఏమేమి జంతువులున్నాయి ?"

"రెండడవి పందులు, ఓ కణుసు ఉన్నాయి ప్రభూ !"

"వాటిసింకా ఎందుకు ఉంచావూ ?"

"చిత్తం, వధించి వండించమని శెలవా ? ప్రభూ !"

"ఛా! మనం మాంసం మానేశాం తెలుసా!"

"చిత్తం, కారణం ఏమిటి ప్రభూ !"

"మనం ఇప్పుడు అహింసావాదులం"

"అవును. కాని చిన్న సందేహం ప్రభూ

"ఏమిటది ?"

"మరి మనకి తుపాకి ఎందుకూ ? అని."

"ఏమి, అది ఆయుధంకదూ ?"

"అవును ప్రభూ! అందుకే అది మనకెందుకా ? అని సంశయం !"

"ఏమి ? శిక్షించడానికి, రక్షించుకోడానికిన్నీ"

"ఎవరిని ప్రభూ శిక్షించడం"

"ఏమీ ? మన మర్యాదాకి ఎదురుతిరిగి మనకి అవమానం కల్గించేవాళ్లెవళ్ళయినా శిక్షించవచ్చు కదూ !"

"చిత్తం. కాని మన మర్యాదా యిప్పుడు రక్షింపబడుతూందా అని సంశయం !"

"ఏమి ?"

"జమీందారీ పోయాక ఇంకా మనకి రాచ మర్యాదలుంటాయా ప్రభూ !"

"జమీందారీకి మర్యాదకి సంబంధం ఏమిటోయ్ !"

"చిత్తం, శ్రీశ్రీశ్రీ దేవగజపతి విక్రమాధిప మహారాజ బహద్దర్ అనే బిరుదావళి ఇంకా నిల్చి ఉంటుందా ప్రభూ !"

"నహీఁనహీఁ. అవన్నీ మరి ఉండవ్"

"అయితే మరి మర్యాదలేవి ప్రభూ ?"

"ఏమీ ! మనకీ మీసం లేదూ ?"

"అదికూడా సగమేకదా ప్రభూ నిల్చింది."

* ఆనందవాణి

"దానికేం, పెంచేస్తాం"

"అయితే తుపాకి ఉండాలంటారా ? ప్రభూ."

"అవశ్యం ఉండవలసిందే !"

"అయితే విలాసంగా వేటాడవచ్చునా ?"

"ఎక్కడ వేటాడతాం ?"

"చిత్తం. అదే తెలియకుండా ఉంది ప్రభూ"

"ఈ చుట్టుప్రక్కల అరణ్యం అంతా మనదే కదోయ్"

"అవును కాని. మరి ప్రభుత్వం తీసుకొంటూందికదా ? అందులో వేట చెయ్యనిస్తుందా ప్రభూ !"

"పోనీ, మనం యింట్లోనే విలాసానికి వేటాడుకుందాం"

"వేటిని ప్రభూ !"

"ఏమీ ! పందులున్నాయి అన్నావుకదూ !"

"అవి రెండేకదా ప్రభూ !"

"కణుజు ఉందన్నావు"

"చిత్తం. మొత్తం మూడవుతాయి. గుర్రాన్ని కలుపుతారా ప్రభూ !"

"అవశ్యం అదిమాత్రం ఎందుకూ మనకి ?"

"కుక్కలో !"

"ఛా ! అవి వేటకుపకరిస్తాయికదోయ్ ?"

"వీటిని వేటాడి ఏంచేస్తారు ప్రభూ !"

"కలెక్టరుకి బహుమతీ పంపుదాం. అతడు చాలా మర్యాదా చేస్తాడు."

"చిత్తం. ఓ కుక్క నిచ్చేదామా ప్రభూ !"

"అవును. అదీ మంచి ఆలోచనే. తప్పకుండా యిద్దాం"

"మరి మనకేం ఉంటుంది ప్రభూ !"

"ఏమీ ! మన మర్యాదా మనకి చాలదోయ్"

"చిత్తం. చిన్న మనవి"

"ఏమిటది వేగంకానీ"

"మనకి తూటాలు లేవు ప్రభూ !"

"ఏమి !"

"అప్పట్లో లైసెన్సుకి దరఖాస్తు పెట్టలేదు"

"ఎంచేత !"

"ఏలినవారెన్నడు వేటాడలేదుకదా ! అని"

"ఛా ! ఇప్పుడు దరఖాస్తుపెడితే"

"ఇవ్వరేమో ప్రభూ !"

"ఎంచేత !"

"జమీందారీ మర్యాదలకని యిచ్చిన తుపాకి లైసెన్సు జమీందారీ అనంతరం ఎందుకిస్తారు ప్రభూ !"

"అయితే ఏం చేద్దాం ?"

"అదే ప్రభూ ఆలోచించాలి"

"తుపాకి లేకపోతే మర్యాదా లేదే !"

"చిత్తం. ఏమి చేయమని శెలవు"

"ప్రభుత్వానికి వ్రాద్దాం"

"ఏమని ప్రభూ !"

"మాకు తుపాకి లైసెన్సు కావాలని"

"కారణం ?"

"వేటాడ్డానికి"

"ఎక్కడో !"

"మన ఇంట్లోనే !"

"నిరాకరిస్తే ?"

"జమీ వదిలోదు"

"అది సాధ్యమా ప్రభూ !"

"ఏమీ, మనం రక్షించుకోలేమంటావా ?"

"ఏ బలంతో ప్రభూ !"

"తుపాకి"

"దానికేకదా లైసెన్సు ప్రభూ !"

"అయితే అలాగే వ్రాద్దాం"

"ఏమని ప్రభూ !"

"మా జమీందారీని మేం ఎంతమాత్రం వదల దలుచుకోలేదు కాబట్టి దాన్ని రక్షించుకునే నిమిత్తం ప్రభుత్వంవారు, మా మర్యాద గమనించి, ముప్పై తుపాకులకి లైసెన్సు అనుగ్రహించవలసిందని."